క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శకుంతల

నల్లచెరువు: మండల పరిధిలోని జోగన్నపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ శకుంతల, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు దాసరి శ్రీనాథ్‌రెడ్డి తనిఖీ చేశారు. పిల్లల హాజరుకు సంబంధించిన రిజిష్టరును పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. పిల్లలకు రోజువారి మెనూ ప్రకారం ఆహారం అందజేయాలన్నారు. తక్కువ బరువున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ లలితమ్మకు సూచించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



ప్రభాకర్ (ఫైల్)

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని వెలిచలమల ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న 98 డీఎస్సీ క్వాలిఫైడ్ ఉపాధ్యాయుడు పసుపులేటి ప్రభాకర్ (58) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఎంఈఓ గోపాల్‌నాయక్, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు గంగాధర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ఉపాధ్యాయుడి స్వస్థలం పులివెందుల నియోజకవర్గం కనుమ కిందకొట్టాల గ్రామం అని వెలిచలమల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వర్‌నాయక్ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

తూము మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి



జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని ధనియానిచెరువు గ్రామంలోని చెరువుకు సంబంధించి కుడి, ఎడమ కాలువతో పాటు తూము మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను బీసీ నేత బాలకృష్ణ నాయుడు, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి కోరారు. బుధవారం జెడ్పీ కార్యాలయంలో వారు చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందించారు. కుడి కాలువకు సంబంధించి 100 మీటర్ల మేర రక్షణ గోడ మరమ్మతులకు రూ.4.80 లక్షలు, ఎడమ కాలువకు సంబంధించి 250 మీటర్ల రక్షణ గోడ మరమ్మతులకు రూ.4.80 లక్షలు తూము మరమ్మతులకు రూ.4 లక్షల వరకూ ఖర్చు వస్తుందంటూ అధికారులు ఎస్టిమేషన్లు వేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొత్తరంగారెడ్డి, నాయకుడు చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఓబిలేసు మృతదేహం

బత్తలపల్లి: మండలంలోని తంబాపురం క్రాస్ వద్ద ఈనెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతి చెందాడు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని తంబాపురం క్రాస్ వద్ద ఈనెల 19న ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నల్లబోయనపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఓబిలేసు, రామలక్ష్మమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వైద్య చికిత్సల నిమిత్తం బెంగళూరుకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతున్న ఓబిలేసు బుధవారం మృతి చెందాడు. మృతదేహానికి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ టి.శ్రీనివాసులు

బత్తలపల్లి: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, చిన్న చిన్న సమస్యలను, గొడవలను నివారించాలని బత్తలపల్లి సీఐ మన్సూరుద్దీన్, ఎస్‌ఐ టీపీ శ్రీహర్షలకు ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులు సూచించారు. బుధవారం రాత్రి బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో కేసుల వివరాలు, సీడీ ఫైల్స్, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గంజాయి, కర్ణాటక మద్యం, బెల్టుషాపులు, మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు.

పంట నష్టపోయిన రైతులందరికీ న్యాయం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- ఈదురు గాలులకు దెబ్బతిన్న పంటల పరిశీలన



దెబ్బతిన్న అరటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: ఇటీవల ఈదురు గాలుల బీభత్సానికి మండలంలో సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండల పరిధిలోని బండ్లపల్లి, దామానుపల్లి, దొరిగిల్లు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరిశీలించారు. పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. బండ్లపల్లిలో చిన్న అక్కులప్పకు చెందిన 5 ఎకరాలలో సాగు చేసిన అరటి నేలకొరిగింది. పంట చేతికొచ్చిన సమయంలో ఇలా జరగడంతో తీవ్రంగా నష్టపోయినట్లు బాధిత రైతు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. దామానుపల్లికి చెందిన రమణారెడ్డి 8 ఎకరాల్లో అరటి తోటను సాగు చేశారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలకు పంట దెబ్బతిందన్నారు. అదే విధంగా దొరిగిల్లు గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి 5 ఎకరాల్లో సాగు చేసిన అరటి తోట గాలి వాన బీభత్సానికి నేలకొరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంబంధిత అధికారులను పిలిచి పంట నష్టపోయిన ప్రతి రైతును గుర్తించాలన్నారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. అదే విధంగా రైతులకు ఏయే సమయంలో ఎటువంటి పంటలు సాగు చేసుకోవాలి? ఎలాంటి మందులు పిచికారి చేసుకోవాలో అవగాహన కల్పించాలన్నారు. మండల వ్యాప్తంగా ఈదురు గాలులకు 145 ఎకరాల అరటి, మామిడి 10 ఎకరాలు, మొక్కజొన్న 5 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఇందుకూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలోకి తరచూ పాములు వస్తున్నాయని అక్కడ ఉన్న వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అంగన్‌వాడీ కేంద్రానికి స్థలాన్ని కేటాయించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేంద్ర, ఎంపీడీఓ విజయలక్ష్మి, హెచ్ఓ అమరేశ్వరి, ఏఓ లక్ష్మీనరసింహులు, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బయపరెడ్డి, సర్పంచులు శివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంగల్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, నాయకులు సచివాలయ కన్వీనర్ భాస్కర్, వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సేవేనాయక్, ఓబిరెడ్డి, శివ, కిరణ్‌మోహన్‌రెడ్డి, సీపీ నారాయణరెడ్డి, రమణారెడ్డి, వేణుగోపాల్, కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, వెంకటేష్, ద్వారకనాథ్‌రెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

ముదిగుబ్బ: మండల పరిధిలోని బూదనంపల్లి, గాండ్లవారిపల్లి, నక్కలపల్లి గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులను బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న బూదనంపల్లికి చెందిన ఎంపీటీసీ శివారెడ్డి ఆరోగ్య పరిస్థితని అడిగి తెలుసుకున్నారు. గాండ్లవారిపల్లికి చెందిన రామ్మూర్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. ఇంటికి వెళ్లి అతడ్ని పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన బాలవీర నారప్ప అనారోగ్యంతో బాధపడుతుండటంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చికిత్స నిమిత్తం రూ.50 వేలు అందజేశారు. అలాగే నక్కలపల్లికి చెందిన దివాకర్‌కు రోడ్డు ప్రమాదంలో కాళ్లు దెబ్బతిన్నాయి. బాధితుని ఇంటికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు సూర్యనారాయణ, వెంకటరమణ, నాయకులు చలమారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జ్యోతిరెడ్డి, మహేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నైపుణ్య శిక్షణ

ధర్మవరం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార ఆర్థిక సంస్థ సౌజన్యంతో సెంట్రల్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ విజయవాడ ఆధ్వర్యంలో రాగ్ పిక్కర్స్‌కు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాగ్ పిక్కర్స్‌కు ప్లాస్టిక్ వస్తువుల తయారీ, ప్యాకింగ్, మార్కెటింగ్, రీసైక్లింగ్ తదితర నైపుణ్యాభివృద్ధి శిక్షణను విజయవాడలో మూడు నెలల పాటు నెలకు రూ.2 వేలు స్టైఫండ్‌తో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల్లోపు వయస్సు ఉండి 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన రాగ్ పికింగ్ కుటుంబాలకు చెందిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత శిక్షణకు అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాస్ 6300147965 నంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీఐపీఈటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభాకర్‌రావు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శంకరయ్య, మున్సిపల్ మేనేజర్ ఆనంద్‌కుమార్, టీపీఆర్ఓ సుబ్బారాయుడు పాల్గొన్నారు.

నేడు సమావేశం

నల్లచెరువు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం వ్యవసాయ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీఓ భారతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి హాజరవుతారన్నారు.

సంక్షేమ సారథులు 'వలంటీర్లు'

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి టౌన్: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్ల సేవలను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికీ మరవలేదని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వలంటీర్లకు పురస్కారాలు అందజేసి, సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు–ప్రభుత్వానికి వారధులుగా సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లను నియమించడం జరిగిందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పచ్చచొక్కాల నాయకులు అడ్డంగా దోచుకున్నారన్నారు. పింఛన్ కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పచ్చచొక్కా నాయకులు చుట్టూ నెలల తరబడి తిరిగినా న్యాయం జరగలేదని విమర్శించారు. వలంటీర్లు పారదర్శకంగా పని చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తెస్తుండటంతో టీటీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. వలంటీర్ వ్యవస్థపై బురదజల్లే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. వలంటీర్లు పైసా లంచం లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అనంతరం ఒకరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 400 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పరికి సాధిక్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు షబ్బీర్, రామ్‌ప్రసాద్, ఆవుల స్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్, జిలాన్, దాదాపీర్, ఇలాహి, మురళి మార్కెట్ నౌషాద్, వలీ, రవి, షామీర్, సంజయ్ బాబు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు..

కదిరి అర్బన్: మండల పరిధిలోని చిగురుమాను తండా సమీపంలో బుధవారం గణపతి చౌడేశ్వరీ దేవి, పోతులరాజు దేవాలయం పునఃప్రారంభోత్సవం జరిగింది. ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయించడంతో పాటు తన సొంత నిధులు రూ. 50 వేలు అందజేసిన ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఖాదీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, సర్పంచులు విశ్వనాథ్, నారాయణ నాయక్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠ నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీరంగారెడ్డి నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బాబ్జాన్, నరసింహులు నాయక్ పాల్గొన్నారు.

'భయపెట్టి టీడీపీలో చేర్పించుకున్నారు'



కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిమర్రి: తమను బెదిరించి టీడీపీలో చేర్పించుకున్నారని మీసాల నారాయణస్వామి, నారాయణ పేర్కొన్నారు. స్థానిక డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి స్వగృహంలో బుధవారం వారు ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డితో కలిసి టీడీపీ నుంచి మళ్లీ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్, ఎంపీపీలు తదితరులు మీసాల నారాయణస్వామి, నారాయణకు వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ.. ఇక నుంచి ప్రలోభాలకు గురికాకుండా వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కేతిరెడ్డికి కృతజ్ఞతగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పాటిల్ ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ వెంకటవరద, అశ్వర్థరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నారపరెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నేరం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ ఐనోద్దీన్

కదిరి టౌన్: జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలతో డిప్యూటీ డీఎంహెచ్ఓ ఐనోద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం పొగాకు విక్రయదారులకు అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో పొగత్రాగడం నిషిద్ధమన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల ఆవరణలో ధూమపానం చేయటం, పొగాకు ఉత్పత్తులు అమ్మకం జరిపితే జరిమానా విధించడం జరుగుతుందన్నారు. పొగాకు సేవించడం వలన కలిగే నష్టాలను తెలియజేశారు. కదిరి బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ధూమపానం చేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజకుమార్, హెచ్ఈ ముస్తఫా, పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్త శమంతకమణి, సూపర్‌వైజర్ రవిశంకర్, వనజ, పద్మావతిరెడ్డి, రెడ్డి, బాష, పోలీసులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి

కదిరి టౌన్: నేషనల్ హెల్త్ మిషన్ కింద వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో పని చేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ ఐనోద్దీన్‌కు బుధవారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు కదిరి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వినతిపత్రం అందజేశారు. 5 సంవత్సరాలుగా ఎటువంటి వేతన సవరణ లేకుండా పని చేస్తున్నామన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరికి వేతన సవరణ చేస్తూ జీఓ నంబర్ 64 ద్వారా ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కాని సీహెచ్ఓ ఇవ్వలేదని తెలిపారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. అలాగే ప్రసూతి సెలవుల్లో ఉన్న మహిళా ఉద్యోగులకు నెల జీతాలు ఇంకా అందలేదన్నారు.

విద్యార్థులకు వరం 'జగనన్న విద్యాదీవెన'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

కొత్తచెరువు: పేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పలు పథకాలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. బుధవారం కొత్తచెరువులోని ఓ ఫంక్షన్ హాలులో ఓ శుభకార్యానికి ఎమ్మెల్యే దంపతులు విచ్చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ప్రవేశపెట్టని రీతిలో జగనన్న విద్యాదీవెన పథకాన్ని సీఎం జగన్ ప్రారంభించారన్నారు. పేదల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి.. వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఇది ఓర్చుకోలేని కొన్ని పార్టీలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. గతంలో వారి హయాంలో అభివృద్ధి చేయలేదన్నారు. ఇటువంటి వాటిని ప్రజలెవ్వరూ నమ్మరని తెలిపారు. కార్యక్రమంలో పుడా చైర్‌పర్సన్ జి.లక్ష్మీనరసమ్మ, జిల్లా అగ్రిబోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీపీలు రమణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, దాల్‌మిల్ సూరి, నాయకుడు గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో పుష్కలంగా ఎరువులు

ఎన్‌పీకుంట: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులకు అవసరమైన ఎరువులు ఆయా ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ముందస్తు ప్రణాళిక ద్వారా రైతులు సాగు చేసే పంటల విస్తీర్ణాన్ని బట్టి అవసరమైన ఎరువులను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఉంచామన్నారు. ప్రాడక్టుల వారీగా 12 మెట్రిక్ టన్నులకు తగ్గకుండా ఆర్బీకే సిబ్బంది ఇండెంట్ పెట్టడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే 860 బస్తాల యూరియా, 436 బస్తాల డీఏపీ, 240 బస్తాల 10:26:26, 240 బస్తాల 20.20.0.13 ఎరువులు ఆయా ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఎంఓపీ (పొటాష్), 14:35:14 ఎరువులు రావాల్సి ఉందన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కనగానపల్లి: మండలకేంద్రం కనగానపల్లిలో శ్రీసత్యసాయి, ఫాదర్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లలో నెమలివరం జట్టుపై మద్దెలచెరువు, బద్దలాపురంపై మామిళ్లపల్లి జట్టు, శివపురంపై భానుకోట, కొండ్రెడ్డిబాయిపై వేపకుంట జట్టు గెలుపొందాయి. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్, డైరెక్టర్ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, యూత్ కన్వీనర్ అంకె అశోక్, నాయకులు పెద్దిరెడ్డి, బాలరాజు, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన

పుట్టపర్తి: నాడు–నేడు పథకం కింద చేపట్టే పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని జిల్లా భూగర్భజల శాఖ అధికారి, బుక్కపట్నం మండల ప్రత్యేక అధికారి టి.రాజశేఖర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మండలంలోని కృష్ణాపురం, సిద్దరాంపురం, లింగప్పగారిపల్లి, మారాల, దూపంపల్లి తదితర పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. భవనాల నిర్మాణం కోసం వినియోగిస్తున్న సామగ్రిని పరిశీలించారు. కొన్ని చోట్ల ఇటుకలు నాణ్యంగా లేవని గుర్తించి, వాటిని వెనక్కి పంపించి నాణ్యమైన ఇటుకలను తెప్పించాలని సంబంధిత ఇంజినీరింగ్ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని కనంపల్లి గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. కొలతల మేరకు పనులు చేయాలని కూలీలకు సూచించారు. అనంతరం కూలీల మస్టర్‌ను పరిశీలించారు. పనుల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.

రేపు 'వలంటీర్లకు వందనం'

గాండ్లపెంట: స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 26న వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అంజినప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందజేసి, సన్మానించడం జరుగుతుందన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

నల్లచెరువు: మండల పరిధిలోని బాలేపల్లి తండాలో బుధవారం మారెమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

తనకల్లు: మండల పరిధిలోని కొర్తికోటలో ఇటీవల మృతి చెందిన బురుజు రమణప్ప కుటుంబ సభ్యులకు బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నౌషాద్ మాట్లాడుతూ.. మిగతా డబ్బులు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనరసమ్మ, ఎంపీటీసీ ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగులప్ప నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, అమరనాథ్‌రెడ్డి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

తనకల్లు: ఖరీఫ్ సబ్సిడీ విత్తన వేరుశనగకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో చేపట్టిన విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలానికి 4,581 క్వింటాళ్ల విత్తన వేరుశనగను ప్రభుత్వం కేటాయించినట్లు పేర్కొన్నారు. విత్తన వేరుశనగపై 40 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. త్వరలోనే విత్తన పంపిణీ చేస్తామన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న పార్టీ సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్, తదితరులు

గాండ్లపెంట: మండల పరిధిలోని మలమీదపల్లి పంచాయతీ కరణంవారిపల్లి గ్రామానికి చెందిన వీరనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్, పార్టీ సీనియర్ నాయకుడు బత్తల వెంకటరమణ బుధవారం వారి స్వగృహంలో రూ.10 వేల సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమణ, హరి, రామకృష్ణ, వెంకటేష్, మల్లిరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ ఏర్పాటు

గాండ్లపెంట: ఈ నెల16న జరిగిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో రజకులు నీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సిద్దారెడ్డికి విన్నవించుకున్నారు. రజకుల వినతి మేరకు అదే రోజు ఎమ్మెల్యే రజకవీధిలో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. పైపులైన్ ఏర్పాటు చేసి మంచినీటి సమస్య లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం సర్పంచ్ రహంతుల్లా కార్యదర్శి రఫీ, తహసీల్దార్ రవి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గజ్జల రవీంద్రారెడ్డి, నరసింహాగౌడ్ తదితరులు పైప్‌లైన్ వేయించారు. దీంతో రజక వీధిలో నీటి సరఫరాకు మార్గం సుగమమైంది.

అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోండి

కదిరి అర్బన్: స్థానిక రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని రైల్వే ఇంజినీర్ అల్లా బకాష్‌కు బుధవారం సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఖాళీ స్థలంలో కంపచెట్లు ఏపుగా పెరగడంతో నిత్యం మద్యం సేవించడం, మాట్కా ఆడటం వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కదిరెప్ప, తరుణ్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చందు

రామగిరి: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను మరింత ప్రోత్సహించి వారి ప్రతిభను వెలికితీసేందుకే క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం పేరూరుడ్యాంలో శ్రీసత్యసాయి, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఇప్పటికే కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో టోర్నీ ప్రారంభించినట్లు తెలిపారు. జూన్ 6వ తేదీన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని అనంతపురంలో జరిగే ఫైనల్ మ్యాచ్‌లో విజేతకు రూ.1.20 లక్షల నగదు బహుమతి అందజేస్తామన్నారు. క్రీడల్లో మరింతగా రాణించాలన్నారు. ఎంసీ పల్లిలో జరిగిన ఓ వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆయన వధూవరులను ఆశీర్వదించారు.

పేరూరు, శ్రీహరిపురం జట్ల జయకేతనం

బుధవారం ఉదయం సుద్దకుంటపల్లి–పేరూరు జట్లు తలపడగా పేరూరు జట్టు, మధ్యాహ్నం ఎంసీపల్లి, శ్రీహరిపురం కాలనీ జట్లు తలపడగా శ్రీహరిపురంజట్టు విజయం సాధించినట్లు టోర్నీ నిర్వాహకుడు దాసరిమోహన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ పి.కర్రెన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్, జెడ్పీటీసీ సభ్యులు గోసే నాగార్జున, గొని మారుతీ ప్రసాద్, సర్పంచ్ రాజేష్, నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, కురుబ ముత్యాలప్ప, జనార్దన్, మల్లికార్జున, ఆది, నరసింహారెడ్డి, సిద్దన్న, ఎజ్జె ఆంజనేయులు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

బత్తలపల్లి: పూలమండీలో పని చేస్తున్న కార్మికుడు జి.కాంతప్ప కొద్ది రోజుల క్రితం పూలను బస్సుపైకి వేస్తుండగా ప్రమాదవశాత్తూ కిందపడటంతో గాయపడ్డాడు. మండలంలోని పోట్లమర్రి గ్రామంలో కాంతప్ప ఇంటి వద్ద ఉండి చికిత్స పొందుతున్నాడు. పూలమండీ అసోసియేషన్ నాయకులు బుధవారం గ్రామానికి చేరుకుని కార్మికుడిని పరామర్శించారు. రూ.75 వేల ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన కార్మికుడు కాంతప్పను మానవతా దృక్పథంతో ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పూలమండీ అసోసియేషన్ నాయకులు లక్ష్మీనారాయణ, నరిసెట్టి రామానాయుడు, సతీష్, రవి, శేఖర్, రామకృష్ణారెడ్డి, నారాయణస్వామి, కమతం శివయ్య, రామ్మోహన్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.